RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 47 Vol: 47 | మార్చి 05 గురువారం 2026 March 05 Thursday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

హిందూ పండగలంటే చిన్న చూపా...? రాజాసింగ్ 2

## మహిళా దినోత్సవం కానుక

### 46 లక్షల మంది మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



**హైదరాబాద్, మార్చి 4 జన సంఘర్షణ**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 8వ తేదీన ఈ భారీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. బుధవారం సెక్రటేరియట్‌లో నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పథకంలో భాగంగా టీ డయాగ్నస్టిక్స్ ద్వారా ప్రతి మహిళకు 30 రకాల ఆరోగ్య

➢ మిగతా 2వ పేజీలో..

## ఎండలు మండుతున్నాయి !

- భారీగా పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- సూర్యుడు సుర్రుమంటున్నాడు.
- ఉమ్మడి జిల్లాలో భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.




**బోధన్: మార్చి 04, జన సంఘర్షణ**
ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారం నుంచి ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచి ఎండ పెరుగుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో తీవ్రరూపం దాల్చుతోంది. దీంతో జనం ఇబ్బంది పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సగటున 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల బాట పడుతున్నారు. ఎండా కాలం అప్పుడే ఉక్కపోత మొదలైంది. ఉదయం పది గంటలు దాటితే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉమ్మడి జిల్లాలోసుర్రుమంటున్నాడు. ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు ఈదురుగాలులతో కూడిన చలి ఉండగా, నాలుగు రోజులుగా చలి మాయమైపోయి.. ఎండ తీవ్రత పెరిగింది. సాధారణ ఉష్ణోగ్రత కంటే ఎక్కువే నమోదు కావడం కలవరపరుస్తోంది. ఫిబ్రవరిలోనే ఎండలు మొదలైతే మే వచ్చే సరికి

➢ మిగతా 2వ పేజీలో..

## మనిషి సృష్టించిన పెను విషాదం

### ఇరాన్ బాలికల మృతిపై కేటీఆర్ ఆవేదన

**హైదరాబాద్, మార్చి 4 జన సంఘర్షణ:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇరు దేశాల మధ్య జరుగుతున్న వైమానిక దాడులు, ప్రతిదాడుల కారణంగా

➢ మిగతా 2వ పేజీలో..



## యుద్ధం మా నిర్ణయం

- మోదీ పర్యటనతో సంబంధం లేదు
- ఇజ్రాయెల్ రాయబారి

**న్యూఢిల్లీ జన సంఘర్షణ:**
ఇరాన్ మరియు ఇజ్రాయెల్ మధ్య గత ఐదు రోజులుగా యుద్ధం కొనసాగుతోంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా టెహ్రాన్‌లోని 30 ప్రాంతాల్లో బాంబు దాడులు చేశాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీతో పాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు మరియు మనవడు ప్రాణాలు కోల్పోయారు. ఖమేనీ మృతిని ఇరాన్ అధికారికంగా ప్రకటించిన తర్వాత ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది. అయితే, ఖమేనీ మృతిపై ప్రధాని మోదీ స్పందించకపోవడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ముఖ్యంగా, మోదీ ఫిబ్రవరి 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించిన రెండు రోజులకే, అంటే ఫిబ్రవరి 28న ఈ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా

➢ మిగతా 2వ పేజీలో..

## భారత్‌కు చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు



**న్యూఢిల్లీ, మార్చి 4 జన సంఘర్షణ::**
ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆధ్వర్యంలోని బృందం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా ఆయనకు గార్డ్ ఆఫ్ ఆనర్ లభించింది. స్టబ్‌తో పాటు ఫిన్‌లాండ్‌కు చెందిన పలువురు కీలక నేతలు, అధికారులు కూడా ఇండియాకు

➢ మిగతా 2వ పేజీలో..

## ముదిరిన యుద్ధం

### ఐదో రోజూ కొనసాగుతున్న దాడులు



**టెహ్రాన్, మార్చి 4 జన సంఘర్షణ:**
ఇరాన్ మరియు అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త కూటమి మధ్య యుద్ధం ఐదో రోజైన బుధవారం మరింత తీవ్రమైంది. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతుండగా, ఇరాన్ క్షిపణి లాంచర్లు, ఆయుధ ఫ్యాక్టరీలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. ఈ దాడులు ఉర్మియా, కెర్మాన్‌షా నగరాలకు కూడా విస్తరించాయి. తూర్పు టెహ్రాన్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌తో సహా గల్ఫ్ దేశాల్లోని

➢ మిగతా 2వ పేజీలో..

# మహిళా దినోత్సవంకానుక

**మొదటిపేజీ తరువాయి..** పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం మూడు దశల్లో సుమారు 46 లక్షల మంది మహిళలకు ఈ స్క్రీనింగ్ పూర్తి చేయాలని, మొదటి దశలో ప్రతి జిల్లాలోని ఐదు మండలాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించాలని మంత్రి సూచించారు.

ఆరోగ్యశాఖ రాబోయే 99 రోజుల కోసం (మార్చి 6 నుంచి జూన్ 12 వరకు) రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను మంత్రి ఆమోదించారు. ఈ ప్రణాళికను మొత్తం నాలుగు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశలో (మార్చి 6-31) మాతా శిశు సంరక్షణ, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత నివారణపై దృష్టి సారించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి 15 వరకు జరిగే రెండో దశలో బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధుల గుర్తింపు కోసం సబ్ సెంటర్ల పరిధిలో విస్తృతమైన క్యాంపులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా డయాలసిస్ రోగులకు వైరల్ ఇన్ఫెక్షన్ పరీక్షలు తప్పనిసరి చేయాలని మంత్రి ఆదేశించారు.

మూడో దశలో (ఏప్రిల్ 16 - మే 15) సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, వడదెబ్బపై అవగాహన కల్పించడంతో పాటు టీబీ నివారణపై చర్యలు తీసుకోనున్నారు. చివరిగా నాలుగో దశలో (మే 16 - జూన్ 12) పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవలను విస్తరించనున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మేడ్చల్ పరిధిలోని 145 అర్బన్ పీహెచ్‌సీలను పాలిక్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేసి స్పెషాలిటీ సేవలు అందించాలని మంత్రి సూచించారు. బస్తీల్లో మొబైల్ వాహనాల ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఆహార కల్తీపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఫుడ్ సేఫ్టీ మేళాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎండలు మండుతున్నాయి

**మొదటిపేజీ తరువాయి..** పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉదయం కొంత చల్లగా ఉంటున్నా.. 10 గంటలు దాటగానే భిన్నమైన వాతావరణం నెలకొంటోంది.రాష్ట్రంలోని పలు ప్రాంతాల కంటే జిల్లాలో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం పట్ల ఆందోళన నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటాయి. ఎండ వేడిమికి ఇప్పటి నుంచే ఫ్యాన్లు, ఏసీల వాడకం మొదలు కావడంతో విద్యుత్తు వినియోగం పెరగడం మొదలైందని అధికారులు చెబుతున్నారు.

భిన్నంగా సాధారణంగా మార్చి నెలలో నమోదయ్యే ఉష్ణోగ్రతలకు భిన్నంగా ఈ ఏడాది నమోదు అవుతున్నాయి.

సాధారణ ఉష్ణోగ్రతల కంటే అయిదు ఎక్కువ ఎండల తీవ్రత (39ళీజ - 40ళీజ) పెరుగుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుండి 3 గంటల మధ్య బయట తిరగకపోవడంపుష్కలంగా నీరు తాగడంమజ్జిగపుచ్చకాయ వంటి చలవ చేసే ఆహారాలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ నుండి రక్షణ పొందవచ్చు.

ఎండల నుండి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు

డీహైడ్రేషన్ నివారణ దాహం వేయకపోయినా తరచుగా నీరుమజ్జిగకొబ్బరి నీళ్లులేదా నిమ్మరసం తాగాలి.

సురక్షితమైన ఆహారం పుచ్చకాయదోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తినాలి.

బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో వెళ్లడం తగ్గించాలి. వెళ్లాల్సి వస్తే గొడుగుటోపీకాటన్ దుస్తులుకూలింగ్ గ్లాసెస్ తప్పనిసరిగా వాడాలి.

ఆరోగ్య హెచ్చరిక వడదెబ్బ లక్షణాలు తలనొప్పిఅలసటవాంతులు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అవసరమైతే తప్ప మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకపోవడం మంచిది.

# భారత్‌కు చేరుకున్న ఫిన్‌లాండ్ అధ్యక్షుడు

**మొదటిపేజీ తరువాయి..** చర్చకు దారితీసింది. దీనిపై సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లపై భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ, ఇది కేవలం ఒక ఆపరేషనల్ అవకాశం మాత్రమేనని, ప్రధాని మోదీ పర్యటన ముగిసిన తర్వాతే ఆ అవకాశం వచ్చిందని తెలిపారు. మోదీ పర్యటనలో కేవలం దేశాభివృద్ధి గురించి మాత్రమే చర్చించామని, దాడుల గురించి ఆయనతో మాట్లాడలేదని స్పష్టం చేశారు. దాడులు చేయాలనే నిర్ణయానికి తమకు రెండు రోజుల సమయం పట్టిందని, ఫిబ్రవరి 28 ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం పొందిన తర్వాతే దాడులు జరిగాయని ఆయన వివరించారు. ఈ దాడుల విషయంలో చాలా కాలంగా అమెరికాతో సంప్రదింపులు జరుపుతున్నామని, సరైన సమయం కోసం వేచి చూసి చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

## హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

### సిఎం రేవంత్‌ను ప్రశ్నించిన రాజాసింగ్

హైదరాబాద్,మార్చి4 :హిందు పండుగలు, ముస్లింల పండుగల మధ్య తెలంగాణ ప్రభుత్వం తేడాలు ఎందుకు చూపిస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. అలాగే హిందూ పండగలపై చిన్నచూపెందుకని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే హిందువుల కోసం ప్రత్యేక వేడుకలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ ప్రకటన చేసేలా చూడాలని కోరారు. రంజాన్ కోసం ఇఫ్తార్ మాదిరిగా హిందువుల కోసం నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల ఓట్ల కోసం ఇఫ్తార్ వేడుకలను చేసే నేతలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల గురించి టోపీ పెట్టుకొనే రాజకీయ పార్టీలకు హిందువులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.

# యుద్ధం మా నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..** విచ్చేశారు. ఈ పర్యటన సందర్భంగా భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపారం, వాణిజ్యం, సాంకేతిక రంగంలో సహకారం వంటి అనేక అంశాలపై చర్చలు జరిపి కీలక ఒప్పందాలు చేసుకోనున్నారు.

స్టబ్ తన పర్యటనలో భాగంగా గురువారం ప్రధాని మోదీతో చర్చలు జరుపుతారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌తోనూ సమావేశమవుతారు. గురువారం సాయంత్రం ప్రధాని మోదీ, అధ్యక్షుడు స్టబ్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడనున్నారు. స్టబ్ రాకపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఆయనకు స్వాగతం పలికారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి ఉపయోగపడుతుందని, గురువారం ఆయనను కలుసుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. భారత పర్యటనపై స్టబ్ కూడా హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని, రాష్ట్రపతులను కలుసుకోబోతున్నట్లు వెల్లడించారు. ఫిన్‌లాండ్ ప్రధాని పెక్కా-టటెరి ఒర్పో ఇటీవలే ఇండియాలో పర్యటించి ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్నారు. ఇండియా, ఫిన్‌లాండ్ మధ్య చాలాకాలంగా స్నేహపూర్వక సంబంధాలున్నాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు.

# ముదిరిన యుద్ధం

**మొదటిపేజీ తరువాయి..** అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు సౌదీలోని ఎంబసీని, దుబాయ్‌లోని యూఎస్ కాన్సలేట్‌ను, ఖతార్‌లోని అల్ ఉదేద్ ఎయిర్ బేస్‌ను ఢీకొట్టాయి. అలాగే ఇరాక్, కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇప్పటివరకు 230 డ్రోన్లు పేల్చినట్టు ఇరాన్ తెలిపింది. కెర్మాన్ సిటీ శివార్లలో ఇజ్రాయెల్‌కు చెందిన మూడు హెర్మేస్ డ్రోన్‌లను కూల్చేసినట్టు ఐఆర్‌జీసీ ప్రాంతీయ విభాగం ప్రకటించింది.

ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో ఇప్పటివరకు 800 మంది ప్రాణాలు కోల్పోయారు. ఐదు రోజుల్లో ఇరాన్‌లోని 1,700 లక్ష్యాలపై దాడులు చేసినట్లు యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇందులో నావికాదళ నౌకలు, సబ్‌మెరైన్లు, క్షిపణి వ్యవస్థలు ఉన్నాయి. కాగా, ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అల్ ఖమేనీ భౌతిక కాయాన్ని టెహ్రాన్‌లోని ప్రార్థనా మందిరంలో ఉంచారు. బుధవారం రాత్రి నుంచి మూడు రోజుల పాటు ప్రజల సందర్శనకు అనుమతి ఇచ్చారు.

# మనిషి సృష్టించిన పెను విషాదం

**మొదటిపేజీ తరువాయి..** మధ్యప్రాచ్యం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలో ఇరాన్‌లోని ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 165 మంది విద్యార్థినులు ప్రాణాలు కోల్పోవడంపై కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఈ దుర్ఘటనకు సంబంధించి మరణించిన బాలికల సామూహిక అంత్యక్రియల దృశ్యాలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్నారు. ఆ దృశ్యాలు అత్యంత భయంకరంగా, మనసును కలచివేసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. యుద్ధం వెనుక ఉన్న ఉద్దేశాలు ఏవైనప్పటికీ, ఇంతమంది ప్రాణాలు పోవడం అన్నది ముమ్మాటికీ మనిషి సృష్టించిన పెను విషాదమేనని ఆయన అభివర్ణించారు. ఈ మారణహోమం రాబోయే తరాలకు కేవలం బాధను, తీరని దుఃఖాన్ని మాత్రమే మిగిల్చుతుందని కేటీఆర్ తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆస్తులను కూడా వదిలేట్టుగా లేరు

### తన పొలం సర్వేకు నోటీసులపై మండిపడ్డ అంబటి

**గుంటూరు, మార్చి4 :** కూటమి ప్రభుత్వం తనపై, తన కుటుంబంపై చేసిన పాశవికమైన దాడి అందరూ చూశారని మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారు మినహా.. రాష్ట్ర ప్రజలు దీనిని దారుణమైన సంఘటనగా పరిగణించారని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తనకు సత్తెనపల్లిలో 22 ఎకరాల పొలం ఉందని.. ఆ పొలానికి కూడా సర్వే పేరుతో నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు. బుధవారం గుంటూరులో మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడారు. తన పొలాన్ని సర్వే చేయాలని ఎమ్మార్వో కార్యాలయం నుంచి తనకు నోటీసులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ తనిఖీ చేయమని చెప్పారని వారు తనకు చెప్పారన్నారు. తన పొలంలో స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌస్ ఉందని.. సర్వే చేయాలని అధికారులు చెబుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు పని ఏమి లేదా అని ప్రశ్నించారు. వారు తన ఆస్తుల మీద పడ్డారని... తాను లీగల్‌గా కొనుక్కున్న స్థలం అదని చెప్పుకొచ్చారు. తాను వేరే వారి నుంచి పొలం కొనుక్కునే ముందే అందులో చిన్న బావి, పెంకుటిల్లు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి అధికారం శాశ్వతం కాదన్నారు. తన దగ్గర దాపరికాలు ఏమి ఉండవుని.. చంద్రబాబు, లోకేశ్ తన పొలం చూస్తాను అంటే రావాలని అన్నారు. తనను బయపెట్టాలని వారు అనుకుంటున్నారని.. రేపు గుంటూరులో తమ ఇంటికి కూడా నోటీసులు ఇస్తారేమోనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

## మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

### రాహుల్‌కు మందకృష్ణమాదిగ లేఖ

**వరంగల్, మార్చి4 :** రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

## పంచగ్రామాల సమస్యలను పరిష్కరించండి

### గతంలో జీవోలు ఇచ్చినా అమలు కాలేదు

### అసెంబ్లలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గంటా

### త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామన్న ఆనం

**అమరావతి, మార్చి4 :** సింహాచలం దేవస్థానం పరిసరాల్లోని పంచగ్రామాల సమస్యపై విశాఖపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఈ సమస్య పెండింగ్‌లో ఉందని అన్నారు. పంచగ్రామాలు ఐదు వేర్వేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయని తెలిపారు. 1996లో అప్పల సూర్యనారాయణ ఆధ్వర్యంలో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారని... ఆ తర్వాత 2000లో 578 జీఓ, 2019లో 229 జీఓలు జారీ చేశారన్నారు. పంచగ్రామాల్లో రైతుల సమస్యలతో పాటు ఇళ్లు నిర్మించుకున్న వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన సభలో తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో 100 రోజుల్లో సమస్య పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. 100 గజాల లోపు స్థలం ఉచితంగా ఇచ్చేలా, అంతకంటే ఎక్కువ ఉంటే డబ్బు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. అయితే కొందరు కోర్టుకు వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే చరిత్ర క్షమించదన్నారు. రెవెన్యూ, దేవాదాయ శాఖ మంత్రులు కూర్చొని తక్షణం ఈ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈ ప్రశ్నకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సమాధానమిస్తూ... గతంలో అసెంబ్లీ హౌస్ కమిటీ, మంత్రివర్గ ఉపసంఘాలు నివేదికలు ఇచ్చాయని తెలిపారు. వాటి ఆధారంగా జీఓలు ఇచ్చినా అమలు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే ఆలోచనలో ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర విధానం రూపొందించిం దని వివరించారు. కొందరి భూములు క్రమబద్ధీకరించిన తర్వాత మళ్లీ కోర్టుకు వెళ్లడంతో సమస్య తలెత్తిందని మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాదాయ, రెవెన్యూ శాఖలను సమావేశపరిచి పరిష్కారం చూడాలని సీఎం సూచించారని తెలిపారు. సర్వే పూర్తి చేసిన తర్వాత 12,410 నివాసాలు ఉన్నట్లు తేలిందని, వాటన్నింటినీ క్రమబద్ధీకరించడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయని మంత్రి వివరించారు. అంతే విలువైన భూమిని సింహాచలం ఆలయానికి ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించగా.. సింహాచలం ట్రస్టు సమ్మతించిందని మంత్రి తెలిపారు. భూమి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. ఈ విషయాలను హైకోర్టుకు అఫిడవిట్ రూపంలో అందజేశామని చెప్పారు. హైకోర్టు ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు-2026

### ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు

### రెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం

**అమరావతి, మార్చి4 :** ఏపీ శాసనసభ ఆమోదించిన రెండు కీలక బిల్లులకు శాసన మండలి ఆమోదం తెలిపింది. ఏపీ అసైన్డ్ భూముల సవరణ బిల్లు-2026 , ఏపీ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు 2026కు శాసనమండలిలో ఆమోదం లభించింది. ఈ సందర్భంగా అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో మాట్లాడారు. అసైన్డ్ భూముల చట్ట సవరణకు శాసన మండలి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. గత గురువారం శాసనసభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. ఈ చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజు ద్వారా కేటాయించే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఎకరాకు ఏడాదికి రూ.31 వేలు లీజు రేటు నిర్ణయించారని.. ప్రతి రెండేళ్లకు 5 శాతం వరకు లీజు మొత్తం పెంచే విధంగా సవరణ చేసినట్లు తెలిపారు. అసైనీ దారులకు ఈ లీజు ద్వారా నికరమైన ఆదాయం లభిస్తుందన్నారు. బంజరు భూములు, చౌడు భూములుగా ఉన్న అసైన్డ్ భూములకు స్థిరమైన ఆదాయం వస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు క్లీన్ ఎనర్జీ చాలా కీలకమని మంత్రి చెప్పారు. క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కొన్ని చోట్ల అసైన్డ్ భూములు అవసరమవుతాయని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. అసైనీదారుల పూర్తి అనుమతితోనే లీజుకు తీసుకుంటామని వెల్లడించారు. ట్రై-పార్టీ అగ్రిమెంట్ ద్వారా వారికి పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తామని అన్నారు. ఈ చట్ట సవరణతో రూ.10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని.. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయాల సవరణ బిల్లు-2026కు కూడా శాసనమండలి ఆమోదం తెలిపింది. గ్రామ, వార్డు సచివాలయాలను 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు'లుగా మార్చే సవరణకు ఆమోదం లభించింది.

# టిడిపి ప్రభుత్వంలోనే తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ: ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు జిల్లా మార్చ్ 4 (జన సంఘర్షణ)

ఏపీ శాసనమండలి సమావేశాల్లో తిరుమల లడ్డు పై జరిగిన చర్చలో కల్తీ ఎవరి హయాంలో జరిగిందో పూర్తి ఆధారాలతో సహా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బయట పెట్టారు. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి ఆరోపణలు వచ్చిన వెంటనే సుప్రీం కోర్టుకు వెళ్లి సిబిఐ విచారణ కోరిందే వై వి సుబ్బారెడ్డి ని అది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిజాయితీ అన్నారు. సిబిఐ ఇచ్చిన రిపోర్టుతో కూటమి ప్రభుత్వ కుట్రలన్నీ ఒకసారిగా బహిర్గతం అయ్యాయన్నారు. రాజకీయ కుట్రగా ప్రారంభమై ఆర్థిక కుంభకోణంగా మారిందన్నారు. సిబిఐ ఇచ్చిన రిపోర్టుతో తెలుగుదేశం పార్టీ నేతల బండారం ఒక్కొక్కటిగా బయటపడుతుందన్నారు. ఇందులో ప్రధాన సూత్రధారి లబ్ధిదారి ఇందాపూర్ డైరీ అని పేర్కొన్నారు. ఈ ఇందాపూర్ డైరీ హెరిటేజ్ సంబంధించిన ఒక యూనిట్ అన్నారు. 320 రూపాయలకు కేజీ నెయ్యి ఇవ్వడం సాధ్యం కాదని అలా ఇస్తే అది కల్తీ నెయ్యి అవుతుందని ప్రజలను రెచ్చగొట్టి ఈరోజు అదే ఇందాపూర్ డైరీకి. కేజీ నెయ్యిని 321 రూపాయల నుంచి 620 రూపాయలకు పెంచి చంద్రబాబు నాయుడు వేల కోట్ల రూపాయలకు కాంట్రాక్ట్ కట్టబెట్టి ఆర్థిక కుంభకోణంగా మార్చారని ఆధారాలతో సహా బయటపెట్టారు. ఇందాపూర్ డైరీ మా మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ అని వెబ్ సైట్ లో పేర్కొన్న హెరిటేజ్ ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ కుట్రను బయటపెట్టి ఇదో ఆర్థిక కుంభకోణం అని చెప్పాము అనంతరం ఫిబ్రవరి 15 న ఇందాపూర్ డైరీ యూనిట్ పేరును హెరిటేజ్ వెబ్ సైట్ లో కోర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ గా మార్చారని ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ బయటపడడంతో చంద్రబాబు నాయుడి కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న హెరిటేజ్ డైరీలో ఈ మార్పులన్నీ జరిగాయాన్నారు. అదే రోజు హెరిటేజ్ సంస్థకు వైస్ ప్రెసిడెంట్ గా ఉన్న వ్యక్తిని రిజైన్ చేయించారని అక్రమాలు కుంభకోణాలు జరిగాయి కాబట్టే చంద్రబాబు నాయుడు ఈ విధంగా వ్యవహరించారని అన్నారు. తిరుమల లడ్డు లో కల్తీ నెయ్యి వినియోగించారని ఇందుకు ఏఆర్ డైరీ కారణం అంటున్నారు అసలు ఈ ఏఆర్ డైరీకి 2014-19 కాలంలో అన్ని అనుమతులు ఇచ్చింది టిడిపి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఏఆర్ డైరీ జూన్ 12న మొదటి ట్యాంకర్ ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన రోజున కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని అనంతరం నాలుగు ట్యాంకర్లు పంపిస్తే వాటిని టిటిడి స్వీకరించి జూలై 6న 2 ట్యాంకర్లు, జూలై 12న రెండు ట్యాంకర్లు వస్తే అందులో కల్తీ ఉందని ఎన్ డి టి బి ల్యాబ్ కు పంపడం జరిగిందన్నారు. అసలు ఎన్ డి టి బి రిపోర్టులో ఏముందో వాస్తవాలు గ్రహించాలన్నారు. ఎన్ డి టి బి రిపోర్టులో పామాయిల్, సన్ ఫ్లవర్, ఆలీవ్ ఆయిల్, సోయా ఆయిల్, తో పాటుగా యానిమల్ ఫ్యాట్ ఉండచ్చని చెబుతూనే ఆవు బలహీనంగా ఉన్న, ఆవు ఫీడింగ్ లో తేడా ఉన్న ఇలాంటి రిపోర్టు వచ్చేందుకు అవకాశం ఉందని రిపోర్టులో స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. నెయ్యి శాంపిల్స్ ఇచ్చిన తర్వాత కూడా కూటమినేతలు ఏమన్నా కల్తీకి పాల్పడి ఉండచ్చు అన్నారు. చంద్ర బాబు నాయుడు ల్యాబ్ రిపోర్ట్స్ ను తప్పుదోవ పట్టించి 120 కోట్ల మంది హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా మాట్లాడటం హిందువుల మనోభావాలను దెబ్బతీయటమేనన్నారు. ఒకవేళ కల్తీ జరిగి ఉంటే ఆ పాపం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానిదే అని ఈ వ్యవహారం అంతా జరిగింది కూటమి ప్రభుత్వ హయాంలోనేనని అన్నారు. దీన్ని తీసుకొచ్చి ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఆపాదించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ముఖ్యంగా కల్తీ నెయ్యి అంశంలో తిప్పి పంపిన నాలుగు ట్యాంకర్లు కాళహస్తి వద్ద ఉన్న వైష్ణవి డైరీ కి వెళ్లి మళ్లీ తిరిగి వస్తే టీటీడీలోకి తీసుకువచ్చింది ఈ ప్రభుత్వమే నన్నారు. కల్తీ జరిగిన నాలుగు ట్యాంకర్లు వైష్ణవి డైరీ కి వెళ్లి తిరిగి వస్తే అవి కల్తీ జరగనున్నట్టా కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ వైష్ణవి డైరీ తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర గారిదన్నారు. ఈ కుట్ర బయటపడుతుందేమోనన్ భయంతో సంఘం డైరీ వద్ద రాసి ఉన్న వైష్ణవి డైరీ పేరును పెయింట్ వేసి కొట్టేసిన ఆధారాలను శాసన మండలి సాక్షిగా ప్రజలకు చూపించారు. అసలు సి బి ఐ చార్జిషీట్ లో యానిమల్ ఫ్యాట్ ఉండటానికి అవకాశం లేదని చెప్పిందన్నారు.

# జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులతో హోలీ సంబరాలు జరుపుకున్నా గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో / మార్చ్ 4(జనసంఘర్షణ )



హోలీ పండుగను పురస్కరించుకుని బుధవారం గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులతో కలసి రంగులు పుసుకున్నారు. హోలీ ప్రకాశవంతమైన రంగులు మీ జీవితాన్ని సానుకూలత, ఆనందంతో ప్రకాశవంతం చేయాలని ఈ హోలీ మీకు ఆనందం, శ్రేయస్సు, మంచి ఆరోగ్యాన్ని తీసుకురావాలి కోరుకుంటూ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, వారితో పాటు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎస్ఎఫ్ఏ ఎ.వినయ్ కుమార్ లు, పారిశుద్ధ కార్మికులు హోలీ లో పాల్గొన్నారు.

# జోరుజారుగా సాగుతున్న మద్యం దుకాణాల సందడి



ఖమ్మం జిల్లా సింగరేణి (జన సంఘర్షణ):

పర్మిషన్ లేకుండా ఆటోలో జోరుగా మద్యం షాపులు వాళ్లు మద్యం దుకాణాల నుండి మధ్యాహ్నం దుకాణంలో పనిచేసే వ్యక్తుల దగ్గర ఉండి సరుకులను దగ్గరుండి ఆటోలలో లోడ్ చేయడం మరి కొందరేమో 2 వీలర్ మీద భారీగా తరలించడం జరుగుతుంది. అలా విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్న పట్టించుకోకుండా అధికారులు తమ పని చేసుకున్నట్లు ఇలా మద్యం మత్తులో ప్రతి పల్లెటూరులో ప్రతి షాపులకు దగ్గరుండి మధ్యన దుకాణాలలో వాళ్లు ముందు కేసులను భారీగా పంపించడం జరుగుతుంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తున్న అధికారులు మద్యం మత్తులో జనాలకు బానిస చేస్తున్న మద్యం యజమాన్యం.

# ఉమ్మడి చల్లసముద్రం పంచాయతీలో ఘనంగా హోలీ సంబరాలు





భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు ప్రతినిధి. ( జన సంఘర్షణ)

ఉమ్మడి చల్లసముద్రం పంచాయతీలో హోలీ పండుగను గ్రామస్థులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే యువత, మహిళలు, పిల్లలు రంగులతో ఒకరిపై ఒకరు చల్లుకుంటూ పండుగ సంబరాల్లో మునిగిపోయారు.హోలీ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, సాంప్రదాయ పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాయంత్రం హోలికా దహనం కార్యక్రమాన్ని నిర్వహించి, చెడు పై మంచి గెలిచిందనే సంకేతంగా గ్రామ పెద్దలు ప్రార్థనలు చేశారు. గ్రామ ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఐకమత్యం, సోదరభావం చాటుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రతినిధులు గ్రామ అభివృద్ధి, శాంతి, సౌభ్రాతృత్వం కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హోలీ సంబరాలు చల్లసముద్రం పంచాయతీలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమంలో ఈ హోలీ పండుగ సందర్భంలో సర్పంచ్ వేప శంకర్, బండారి శీను, నరాటి వెంకన్న, జర్నలిస్ట్ శోభన్, సురేష్, పాష, అరేం స్వామి, సతీష్ వీరన్న, కుమార్, వీరు, భవసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమంతుని పల్లకి సేవ

లింగంపేట్:మార్చ్ 04 (జనసంఘర్షణ)



లింగంపేట్ మండలం లోని పోల్కంపేట్ గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామస్తులు హనుమంతునికి ఘనంగా పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అనాదిగా వస్తున్న ఆచార సాంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం పాల్గుణ పౌర్ణమి (హోలీ పండగ) రోజున హనుమంతునికి పల్లకి సేవ నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా హరిహరా గోపాలస్వామి గుడి వద్ద పల్లకిని అందంగా ముస్తాబు చేసి గ్రామ పురోహితుడు చత్రం త్రివిక్రమాచారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమంతుని ఉత్సవ విగ్రహంతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజన పాటలతో భక్తిపారవశ్యంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దివిటి రమేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల శాఖ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఛత్రం రామానుజా చారి, వార్డు సభ్యులు సాయిలు, గ్రామస్తులు సబ్బిడి అంజయ్య, మద్రి మల్లేశం, కోర్పొత్ సాయిలు, చింతకుంట రాజు, సుభాన్ రెడ్డి, శ్రీనివాస్, అభిషేక్, దుర్గయ్య, బషయ్య, శ్రీశైలం, సత్యనారాయణ, తోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మో పులి...

- కూనిపూర్ గ్రామంలో పులి వేటలో రెండవసారి మేక మృతి.
- మేకల కాపరికి నష్టపరిహారాన్ని అందజేస్తాం అన్న ఫారెస్ట్ అధికారులు.



నిజామాబాద్ జిల్లా. వర్ని . మార్చ్ 4 (జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లావర్ని మండల కేంద్రంలో ని కూనీపూర్ గ్రామం అటవీ ప్రాంతంలో ఉండడంతో గతంలో మేకల గుంపు పై దాడి చేసి మేకను చంపిన పులి ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు ఇచ్చినప్పటికీ ఈ చిన్న గుట్ట ప్రాంతంలో పులి సంచారం ఏమీ ఉండదు అని అనుకున్నారు. కుక్కల సాయిలు తండ్రి గంగారం అనే మేకల కాపరి గుట్టలో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద మేకలు మేపుతుండగా ఒక్కసారిగా హఠాత్తుగా మేకపై దూకి పొట్ట భాగంలో మెడ భాగంలో పంటి ఘా ట్లను దింపడంతో మేక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన మూడు నాలుగు గంటల ప్రాంతంలో జరిగినట్టు కుక్కల గంగారం తెలిపాడు. ఈ ఘటన చూసిన తర్వాత అక్కడికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు నిజంగానే పులి సంచరిస్తుందని గ్రామస్తులకు జాగ్రత్తగా ఉండాలని ఒంటరిగా గుట్టల్లో సంచరించకుండా గుంపులు గుంపులుగా ఉండాలని పలు సూచనలు చేశారు. తొందరలోనే పులి కోసం బోనును ఏర్పాటు చేసి పట్టుకునే ప్రయత్నం చేస్తామని గ్రామస్తులకు తెలిపారు. మేక మృతి పై పోస్టుమార్ట్ అనంతరం మేకల కాపరి కి నష్టపరిహారాన్ని అందజేస్తామని తెలిపినట్లు కూనీపూర్ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ తెలిపారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం లబ్ధిదారుల నిరసన..

రాజంపేట : మార్చ్ 04 (జనసంఘర్షణ)



రాజంపేట మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకు కాకుండా అనర్హులకు కేటాయించారని ఆరోపిస్తూ రాజంపేట గ్రామస్తులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మొదటి, రెండవ విడుదలలో తమకు ఇండ్లు మంజూరు అయినట్లు సమాచారం ఉన్నదని ఇప్పుడు తమకు ఇండ్లు రాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయానికి వచ్చి తమ గోడు వెల్లబోసుకుందామంటే కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో కార్యాలయం బయటనే కూర్చొని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిరసనకారుల వద్దకు చేరుకొని వారిని సముదాయించి అక్కడే కూర్చుండబెట్టారు. కార్యక్రమం పూర్తయింతవరకు గ్రామస్తులను కార్యాలయ ఆవరణంలో నిర్బంధించడం పట్ల గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కార్యక్రమం పూర్తయిన తర్వాత గ్రామస్తులు సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లగా ఎందుకు గ్రామస్తులను నిర్బంధించారని తాహసిల్దార్ తో వాగ్వాదానికి దిగారు. అర్హులైన వారికి కాకుండా అనర్హులకు 15 మందికి ఎలా కేటాయించారని పూర్తిగా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఉన్నదని సర్పంచ్ ఆరోపించారు. రెవెన్యూ అధికారుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని సర్పంచ్ శ్రీకాంత్ తెలిపారు.

# హోలీ సంబరాల్లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ . మార్చ్ 4 (జనసంఘర్షణ)



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల బుధవారం హోలీ పండుగ నిర్వహించుకుంటున్నారు. దీంట్లో భాగంగా నిజామాబాద్ పట్టణంలో చిన్నారులు మొదలుకొని, పెద్దల వరకు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు. భారస మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తన ఇంట్లో, ఆయన అభిమానులతో, అనుచరులతో కలిసి హోలీ పండుగలు పాల్గొన్నారు. స్వయంగా బాజిరెడ్డి గోవర్ధన్ తన అభిమానుల పై రంగులు చల్లారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ హోలీ పండుగ అందరి ఇళ్లల్లో సుఖశాంతులు నింపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు బాజిరెడ్డి గోవర్ధన్ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక"

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.
- ప్రభుత్వ ఆలోచనను, ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కలెక్టర్లదె!



హైదరాబాద్, మార్చి 4( జన సంఘర్షణ )

మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సమావేశంలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ 3 నెలలు ప్రతి కలెక్టర్ పనితీరుకు కొలమానమని, వారి సర్వీస్ కెరీర్‌కు పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జిల్లా కలెక్టర్లు వారధిగా పని చేయాలని చెప్పారు. "ప్రభుత్వానికి కళ్లు, చెవులు అధికారులే. కలెక్టర్లుగా క్షేత్రస్థాయిలో పర్యటించకపోతే ప్రజా సమస్యలు అర్థం కావు. నెలలో కనీసం 10 రోజులైనా క్షేత్రస్థాయిలో పర్యటించాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. కలెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు మదింపు చేసి నివేదికను అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కొందరు కలెక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. "ఆషామాషీగా ఐఏఎస్ కాలేరు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఆ ఉద్యోగానికి సార్థకత చేకూరుతుంది. క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తేనే కలెక్టర్లుగా రాణించగలరు." "కలెక్టర్ల పనితీరును ప్రభుత్వం నిశితంగా గమనిస్తుంది. మీరు మంచి పనిచేస్తే మిమ్మల్ని అభినందిస్తుంది. పర్ఫార్మెన్స్‌కు సంబంధించి వార్షిక నివేదికల ఆధారంగా పనితీరు బేరీజు వేస్తాం. వచ్చే జూన్‌లో కలెక్టర్ల పనితీరుపై మరోసారి సమావేశం నిర్వహిస్తాం." అని చెప్పారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు జరిగే 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల సమన్వయంతో, వారి భాగస్వామ్యంతో 99 రోజుల ప్రణాళిక అమలు చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు మార్చి 12న జిల్లా కేంద్రాల్లో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శాఖల వారీగా 10 వారాల పాటు అమలు చేసే ప్రత్యేక కార్యాచరణ అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని ఆదేశించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, ముందుగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలన్నీ వేడుకలా జరగాలని సూచించారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలి. వాటితో గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి కలిగిన లబ్ధిని ప్రజలకు వెల్లడించాలి. ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నైజేషన్) చేపట్టాలి. అర్హులకు కచ్చితంగా లబ్ధి జరగాలి. అదే సమయంలో అనర్హులు లబ్ధిపొందకూడదు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగాం. సాంకేతికతను సరిగా వినియోగించుకోలేక ఇంత పెద్ద సంఖ్యలో అనుచిత లబ్ధి పొందారు."రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం ఒక అధికారికి బాధ్యత ఇవ్వండి. ఆ అధికారి తప్పనిసరిగా పాఠశాలలో భోజనం చేయాల్సిందే. కలెక్టర్లు వారానికి ఒకసారైనా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేయాలి" అని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం తొలి రోజున జూన్ 12న రాష్ట్రంలోని అన్ని స్కూళ్లలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందించాలి. విద్యా శాఖ అధికారులు ఇప్పట్నుంచే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రులను కూడా తరచుగా సందర్శించాలి. సమస్యలు రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యం సహించబోం. వైద్యంపై ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. ఏటా సీఎంఆర్ఎఫ్, ఆరోగ్య శ్రీకి దాదాపు రూ.2500 కోట్లు ఖర్చు పెడుతోంది. భవిష్యత్‌లో అన్ని మెడికల్ కాలేజీలతో ప్రభుత్వ హాస్పిటల్స్‌ను అనుసంధానం చేయాలని భావిస్తున్నాం. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మిల్లర్ల దగ్గర నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టాల్సిన బాధ్యత కలెక్టర్లదే. మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కలెక్టర్లు కఠినంగా వ్యవహరించాలి. అలాగే, ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్ పట్ల కఠినంగా వ్యవహరించకపోతే కలెక్టర్, ఎస్పీలపై చర్యలు తీసుకుంటాం. బోగస్ ఉద్యోగులను సృష్టించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల విషయంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రంలో దాదాపు 1.70 లక్షల మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులుంటే, అందులో దాదాపు 25 వేల మంది కనీసం ఆధార్ కార్డు లేకుండా బోగస్ ఉద్యోగులుగా ఇంతకాలం జీతాలు తీసుకున్నారని గుర్తించాం. వాటన్నింటిపైనా ఆడిట్ చేయించి ఆర్థిక శాఖ అధికారులు కేసులు నమోదు చేయాలి. భూభారతి దరఖాస్తులన్నీ గడువులోగా పరిష్కరించాలి. అక్రమాలు జరిగితే వెంటనే గుర్తించాలి. ప్రభుత్వ ఆఫీసులకు సొంత భవనాలుండాలి. వివిధ ప్రాజెక్టులు, రీజనల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్ సిటీ, మామునూర్, ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులు, ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలి. (తెలంగాణ రైజింగ్)విజన్ అమలులో జిల్లా కలెక్టర్లు నూటికి నూరు శాతం తమ భాగస్వామ్యం పంచుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

# యూరియా కోసం రైతుల ఆందోళన.. గున్కూల్ సొసైటీలో ఉద్రిక్తత



మార్చ్ 4 జనసంఘర్షణ

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్: మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని గున్కూల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం ఉదయం యూరియా కొరతతో రైతులు ఆందోళనకు దిగారు. సొసైటీ గోదాంకు ఉదయం 666 యూరియా బస్తాలు చేరుకున్నట్లు సమాచారం అందడంతో రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. రైతులు యూరియా యాప్‌లో బుకింగ్ చేసుకునేందుకు సిద్ధమయ్యేలోపే కేవలం ఒక నిమిషంలోనే మొత్తం 666 బస్తాలు ఖాళీ అయినట్లు యాప్‌లో చూపించడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తమకు యాప్‌లో "స్టాక్ లేదు" అని చూపెడుతుండగా, ఈ బస్తాలు ఎవరికి బుక్ అయ్యాయి? ఎక్కడికి వెళ్లాయి? అనే ప్రశ్నలతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సొసైటీ కార్యాలయం వద్ద రైతులు అధికారుల కోసం వేచి చూసినప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు అక్కడికి రాలేదని రైతులు ఆరోపించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఒక్కసారిగా ఆగ్రహించిన రైతులు సొసైటీ అధికారులను నిలదీసే క్రమంలో కార్యాలయ క్యాబిన్‌కు గల అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయి. అనంతరం సొసైటీ అధికారులు రైతులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. యూరియా సరఫరా, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

# విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలి




ఎల్లారెడ్డి. మార్చ్ 4 ( జనసంఘర్షణ)

విద్యుత్ శాఖ లైన్మెన్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ స్టేషన్ లో విద్యుత్ శాఖ సిబ్బంది లైన్మెన్ దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డిఈ విజయ సారథి ఫీల్డ్ లో పనిచేసే సిబ్బందికి శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. అందరికీ మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు. అనంతరం విద్యుత్తు లైన్లో సరి చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ట్రాన్స్కో డి ఈ వివరించారు. విద్యుత్తు స్తంభాలు ఎక్కేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్లు సరి చేసినప్పుడు శాఖ పరమైన నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. సబ్ స్టేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవున్నారు. విధుల పట్ల అంకితభావంతో మెదలాలు అన్నారు. అనంతరం సిబ్బందితో విద్యుత్ శాఖ సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక ట్రాన్స్కో ఏఈ వెంకటస్వామి, ఫోర్ మెన్ గంగాధర్, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ సిద్ధేందర్ రెడ్డి, లేని ఇన్స్పెక్టర్ జగదీశ్వర్, లైన్మెన్లు బాలకిషన్ గౌడ్, కాశీరాం, శశికాంత్ రెడ్డి, రాజేశ్వర్ తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు గరిటే పట్టగలరు....గన్ను పట్టగలరు...




హైదరాబాద్ బ్యూరో /మార్చ్ 4(జనసంఘర్షణ )

మహిళలు వంటింట్లో గంటి తిప్పగలరు యుద్ధ భూమి లో గన్ను పట్టగలరు అన్నది ఆధునిక కాలం రుజువు చేస్తోంది అని శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ ఆధ్వర్యం లో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గురు వివిధ రంగాల చెందిన గాయని అమనికి , సంఘ సేవకులు శోభా రాణీకి అధ్యాత్మిక వేత్త ప్రభావతి కి సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి వీరిని శాలువా నూతన వస్త్రాలు తో సత్కరించి మాట్లాడారు నేడు లోకం పోకడలు విపరీత ధోరణి లో వున్నాయి అని చెప్పారు. ఇట్టి పరిస్థితులు లలో ఇంటిని చక్క దిద్దుకుంటూ వివిధ రంగాల్లో తమ ప్రతిభ ను సేవా గుణాన్ని చూపుతున్న ఆమని,శోభా రాణి,ప్రభావతి లు ఇతరులకు ప్రేరణ కలిగిస్తారు. అని అభినందించారు గాన సభ విభిన్న కార్యక్రమాలు చేస్తూ గొప్ప గుర్తింపు పొందుతోంది అని కొని యాడారు. మానవీయ పరీమలల పూదోట గాన సభ అని అభివర్ణించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆమని రాష్ట్ర ప్రభుత్వ అధికారీ గా పని చేసి శృతి లయ సంస్థ నిర్వహాకురాలు గా తాను పాడుతూ తోటి గాయనీ గాయకుల ను ప్రోత్సహిస్తూ పలువురు ప్రముఖులు ప్రశంస పొందారు అని చెప్పారు. శోభా రాణి స్వామి వివేకానంద సందేశం సూక్తులు లు ప్రచారం చేస్తూ యోగ తరగతులు నడపడం తో పాటు షీ టీమ్ కార్యకర్త గా స్త్రీ రక్షణ కోసం విశేష కృషి చేస్తున్నారు అని చెప్పారు. ప్రభావతి ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముందు ఉండి పలు ధార్మిక సేవలు అందిస్తున్నారు అని తెలిపారు.

# ఎల్లారెడ్డి ఆర్డీఓగా ప్రభాకర్



ఎల్లారెడ్డి: మార్చ్ 04 (జనసంఘర్షణ)

ఎల్లారెడ్డి ఆర్‌డిఓగా ఆర్ ప్రభాకర్ బుధవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అంతకు ముందు కార్యాలయ సిబ్బంది నూతన ఆర్డీవోకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఏఓ అనిల్, డిప్యూటీ తహసీల్దార్ మానస, కార్యాలయ సిబ్బంది ఇమ్రాన్, మహేష్, బిక్షపతి, గురు ప్రసాద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మహిళా సంఘాలకు ప్రమాద, రుణ బీమా

మార్చి 4 జనసంఘర్షణ



ప్రభుత్వం మహిళా సంఘాలకు ప్రమాద బీమా, రుణ బీమా సాయం సత్వరమే అందించాలని ఆదేశాలు జారీ చేసింది. బాధిత కుటుంబాల నుంచి అప్లికేషన్లు అందిన వెంటనే పరిశీలించి చెల్లింపులు చేయాలని డీఆర్డీవోలకు నిర్దేశించింది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లకు ఈ బీమా సాయం అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది.

## హోలీ సంబరాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



మార్చ్ 4జన సంఘర్షణ

బంజారాహిల్స్‌లోని తన కుటుంబ సభ్యులు, మనుమలు రిషిక్ రెడ్డి, రుషాంక్ రెడ్డి లతోకలిసి హోలీ సంబురాలు జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి. హోలీ పండుగ మన అందరి జీవితాల్లో కొత్త రంగులు నింపాలని, కామ దహనం చేసి, రంగులు చల్లుకుని, ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండాలని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన పోచారం శ్రీనివాస్ రెడ్డి.

## ఒకేసారి 3నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయం

మార్చి 4 జనసంఘర్షణ



రేషన్ బియ్యం పంపిణీపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ లబ్ధిదారులకు మూడు (ఏప్రిల్, మే, జూన్) నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశాలు జారి చేసింది. ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఆయా రాష్ట్రాలకు కేటాయించిన నిల్వలను వెంటనే లిఫ్ట్ చేయాలని ఆదేశించింది.

## ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే

పలమనేరు, మార్చి 4 జనసంఘర్షణ :



గంగవరం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనపై ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐదు మంది అక్కడికక్కడే మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## లక్ష్మీపురం లో ఘనంగా నాగమ్మ జాతర

రామకుప్పం మార్చి 04,(జన సంఘర్షణ):



మండల పరిధిలోని 90 బంధార్లపల్లి లక్ష్మీపురం గ్రామంలో అత్యంత ఘనంగా జరుగుతున్న నాగమ్మ దేవత జాతర మహోత్సవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు భక్తాదులు పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నేతలు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ తమ తమ గ్రామాల్లో, తమ ప్రాంతాల్లో అమ్మవారిని వివిధ రూపాలతో వివిధ పేర్లతో పూజిస్తూ పెద్ద ఎత్తున జాతరలు పండగలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని వీటికి నిదర్శనమే సుదూర ప్రాంతంలో ఉన్న లక్ష్మీపురం గ్రామంలో తెలుగు మహిళా నాయకురాలు తులసమ్మ ఆధ్వర్యంలో జాతర విజయవంతంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రకళ అలివేలు శ్రీనివాసులు, రామకుప్పం మండల 3 క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, రెస్కో డైరెక్టర్ సతీష్, మాజీ సర్పంచ్ పెరుమాళ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరీష్, జనసేన భాస్కర్, ముఖ్య నేతలు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ఆనంద్, రమేష్ రెడ్డి, పవన్, మహిళా నేతలు తులసమ్మ,రాణమ్మ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## కే ఎస్ ఎస్ సర్వే లబ్ధిదారులకు వరం లాంటిది

రామకుప్పం మార్చి 04,(జన సంఘర్షణ):



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన కే ఎస్ ఎస్ సర్వే లబ్ధిదారులకు వరం లాంటిదని రామకుప్పం మండల పరిషత్ అధ్యక్షులు సులోచన గుర్రప్పలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వంశీ గాని పల్లి పంచాయతీలో ఇంటింటా కె ఎస్ ఎస్ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో కూటమి ప్రభుత్వం వినూత్నంగా కె ఎస్ ఎస్ సర్వేను అమలు చేసినట్లు చెప్పారు. ఈ సర్వే ద్వారా ఇంటింటా తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ఆరా తీయడం జరుగుతుంది. దీంతో అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే సకాలంలో లబ్ధిదారులకు న్యాయం చేయకు వచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు ఈ సర్వే కార్యక్రమం లబ్ధిదారులకు వరంలా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ప్రెసిడెంట్ మహేష్ స్కూల్ కమిటీ చైర్మన్ షణ్ముగం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలమనేరు, మార్చి 04,(జన సంఘర్షణ):



పలమనేరు-మహాదేవ మంగళం 220 కేవీ లైన్లో మరమ్మతుల కారణంగా, 05.03.2026 తేది ఉదయం 06.00 గంటల నుండి 09.3.2026 సాయంత్రం 06.00 గంటల వరుకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సబ్ డివిజన్ అధికారి సురేష్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా , పలమనేరు, బైరెడ్డిపల్లె, వి. కోట, శాంతీపురం, కుప్పం మండల పరిసరాలలో అత్యవసర సమయంలో మాత్రం విద్యుత్ అంతరాయం కలిగవచ్చు... లేనిచో అంతరాయం ఉండదన్నారు. ప్రజలు సహకరించగలరు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## నంద్యాలలో పాల కల్తీపై అవగాహన సదస్సు

నంద్యాల మార్చి 04,(జన సంఘర్షణ):




రాజమండ్రిలో జరిగిన పాల కల్తీ ఘటనతో అప్రమత్తమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పాల కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీలు చేపట్టింది. ఈ నేపథ్యంలో నంద్యాల పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆధ్వర్యంలో పాల కల్తీ నివారణపై పాల వ్యాపారస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పాలలో కల్తీ ఎలా జరుగుతుందో ప్రయోగాత్మకంగా వ్యాపారుల సమక్షంలో ప్రదర్శించారు. పాల నాణ్యతను కాపాడేందుకు వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ప్రజలు కూడా పాల కల్తీని అరికట్టడంలో భాగస్వాములు కావాలని, ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకట రాముడు, ఆయన సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక ధరలకు యూరియా అమ్మకాలు..

- రైతుల ఆందోళన-అధికారులకు ఫిర్యాదు....
- వ్యవసాయాధికారి మీడియా జోక్యంతో ప్రభుత్వ ధరకే అమ్మకం....
- అధిక ధరల అమ్మకంపై చర్యలు తీసుకుంటాం.. ఏవో
- 150 టన్నుల యూరియా అధిక ధరలకు అమ్మకం...






నాగిరెడ్డిపేట: మార్చ్ 04 (జనసంఘర్షణ)

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో లక్ష్మీ నరసింహ ట్రేడర్స్ ఫర్టిలైజర్ ఓనర్ రాజు 300 రూపాయలకు ఒక బస్తా చొప్పున ఆన్లైన్లో బుక్ చేసుకున్న రైతులకు నమ్మకాలు జరుపుతుండగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎందుకు అమ్మడం లేదని రైతులు ఫర్టిలైజర్ షాపు ఓనర్ను నిలదీశారు. షాపు వద్దకు చేరుకున్న రైతులు కొంతమంది 300 రూపాయలు చెల్లించి యూరియా బస్తాలను తీసుకువెళ్లారు. 300 రూపాయలకు యూరియా బస్తా అమ్మకంపై రైతులకు అనుమానం వచ్చి నీ షాపు ఆన్లైన్లో ఉంది కదా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ విధానంలో మేము అందరం యూరియా బస్తాలను బుక్ చేసుకున్నామని ప్రభుత్వ రేటు కాక అధిక రేటు ఎలా అమ్ముతున్నామని, బస్తాల అమ్మకాల బిల్లులు కూడా ఇవ్వడం లేదని షాపు ఓనర్ను నిలదీసి రైతులందరూ ఆందోళనకు దిగారు. 150 టన్నుల యూరియా ఒక బస్తా 300 కు అమ్మారు. ఇందులో ఆందోళన చేయగా ఆయన దగ్గరగా అరుస్తూ ఇంతకుముందు 150 టన్నుల యూరియా అమ్మానని ఒక బస్తా 300 రూపాయలకే అమ్మానని. ఇప్పుడు కూడా అదే రేటుకు అమ్ముతున్నానని వ్యవసాయ అధికారి సాయికిరణ్ ముందు మీడియా ముందు బాటంగా తెలిపాడు. రైతులు స్థానిక వ్యవసాయ అధికారి సాయికిరణ్ కు ఫోన్ ద్వారా ఫలానా ఫర్టిలైజర్ షాపులో అధిక రేటుకు యూరియా అమ్ముతున్నాడని, అటు అధికారికి మీడియాకు ఫోన్ చేయడంతో అధికారి మీడియా అక్కడికి చేరుకోగా అధికారి మీడియా ముందే ఒక యూరియా బస్తా ప్రభుత్వం రేటు 266 ఉండగా అమాలితో కలిపి 2 70 రూపాయలకు ప్రాథమిక సంఘాలలో ఇతర ఇతర ఫర్టిలైజర్ షాపులలో అమ్మకాలు జరుపుతున్నారు. లక్ష్మీ నరసింహ ట్రేడర్స్ షాపు ఓనర్ మాత్రం భాగంగా వ్యవసాయ అధికారి షాపులోకి వెళ్లి అధిక ధరకు ఎందుకు అమ్ముతున్నావు అని ప్రశ్నించిన అధికారికి మీడియాకు సమాధానం ఇవ్వకుండా మా అనుకూల రైతుల కోసం యూరియా తెప్పించానని నాకు అనుకూలమున్న రైతులకు నేను అమ్ముకుంటానని గట్టిగా బెదిరిస్తూ మాట్లాడాడు. అందుకు రైతులు ఆగ్రహించి నీ షాపు ఆన్లైన్లో ఎందుకు పెట్టావ్ అని నీ అనుకూలం ఉన్న రైతులకు ఇవ్వాలనుకుంటే మీ ఇంటి కాడ అమ్ముకోవాలని షాపు ఓనర్ పై తిరగబడ్డారు. రైతులు వ్యవసాయ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడంతో అధికారి అధిక ధరలకు అమ్మకాలపై విచారణ జరిపి 300 రూపాయలకు అమ్మిన విధానంపై చర్యలు తీసుకుంటామని 300కు అమ్ముతున్న యూరియా బస్తాల అమ్మకాలను నిలిపివేశారు. ఓనర్ దిగివచ్చి ప్రభుత్వ ధరకే చెల్లిస్తానని రైతుల ముందు వ్యవసాయ అధికారి ముందు, ముందు ఒప్పుకోవడంతో రైతులు సర్దుమని గి ప్రభుత్వ రేటుకు ఆన్లైన్లో బుక్ చేసుకున్న రైతులు యూరియా బస్తాలు తీసుకువెళ్లారు. అంతకుముందు 300 రూపాయల కు అమ్మిన విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు పంపానని స్థానిక వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు.

**అధిక రేటుకు అమ్మిన షాపు ఓనర్ పై చర్యలు ఉంటాయి..**

అధిక రేట్లకు అమ్మిన విషం పైన షాపు ఓనర్ పై చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ రైతులకు హామీ ఇచ్చారు. ఇలా మారుమూల ప్రాంతాలలో కొంతమంది ఫర్టిలైజర్స్ గుట్టు గెలవకుండా యూరియా షార్ట్ ఏజ్ ఉంది. కావున రైతులకు అత్యవసర పరిస్థితుల్లో ఏ రేట్ కి ఇస్తే ఆ రేటుకు కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి జిల్లాలో ఏ షాపులో ఏ రేటుకు అమ్ముతున్నారు. అమ్మిన రేటు రసీదు ఇస్తున్నారో లేదో, ఆ షాపుకు అంత యూరియా వచ్చిందో ఎప్పటికప్పుడు అధికారులు షాపులను తనిఖీ చేయాలని రైతుల డిమాండ్ చేశారు.

## హుంసాలో పిడుగులు గుద్దుల ఆట

నిజామాబాద్ జిల్లా సాలూర. మార్చ్ 4 ( జనసంఘర్షణ )



హోలీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఒకొక్క ప్రాంతంలో ఒక్కొక్క సాంప్రదాయ పద్ధతులు హోలీ పండుగలు నిర్వహించుకుంటారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హుంసా గ్రామంలో హోలీ పండుగ అయిన తర్వాత మరుసటి రోజు పిడుగుద్దుల ఆట కొనసాగిస్తారు. ఇది గత దశాబ్దాల కాలంగా ఈ గ్రామంలో కొనసాగుతుంది. హనుమాన్ మందిర్ వద్ద 500 మీటర్ల దూరంలో రెండు కర్రలు కట్టి ,ఆ కర్రలకు ఓ పెద్ద తాడు కడతారు. ఆ తాడుకు ఇరువైపులా అదే గ్రామానికి చెందిన యువకులు ఉంటారు. ఒక పది నిమిషాల పాటు ఒకరిపై ఒకరు పిడి గుద్దులు గుద్దుకుంటారు. దీంట్లో కొంతమందికి గాయాలు కూడా అవుతాయి. అయినప్పటికీ ఆ గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా ఈ పిడి గుద్దుల ఆటలో పాలుపంచుకుంటారు. గతంలో చాలా సందర్భాల్లో పోలీసులు ఈ పిడుగుల ఆట నిర్వహించకూడదని ఆదేశించినప్పటికీ, తమ గ్రామంలో ఈ ఆట నిర్వహించుకుంటే తమ గ్రామానికి అయిష్టం కలుగుతుందని ,ఆ గ్రామస్తులు పోలీసులకు వివరించి, పోలీసుల సమక్షంలోని కేవలం పది నిమిషాల పాటు ఈ పిడి గుద్దుల ఆట కొనసాగుతుంది. తాడుకు ఇరువైపులా ఉన్న వ్యక్తులు ఒకరిపై ఒకరు పిడి గుద్దులు గుద్దుకుంటూ ఈ ఆటలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. గాయలైతే చాలా మంచిదని ఆ గ్రామస్తుల నమ్మకం. ప్రతి హోలీ పండుగ జరిగిన మరుసటి రోజు ఆనవాయితీగా వస్తుంది. ఈ పిడిగుద్దుల ఆట తిలకించడానికి గ్రామం గ్రామమంతా తరలివస్తుంది, ఈ గ్రామం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాలనుంచి గ్రామస్తులు తరలివచ్చి ఈ పిడిగుద్దుల ఆట తిలకిస్తారు.

## బోధన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న పోలీస్ కమీషనర్



బోధన్ మార్చ్ 4 ( జనసంఘర్షణ )

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ జామ మసీద్‌లో బుధవారం రాత్రి మజీద్ కమిటీ అధ్యక్షుడు గుల్షని ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానిక నిజామాబాద్ పోలీస్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముక్తి జావేద్ నిర్వహించిన దువాలో సీపీ పాల్గొని, అనంతరం ఉపవాస విరమణ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రంజాన్ మాసం విశిష్టతను విశ్లేషణాత్మకంగా వివరించారు. రంజాన్ అనేది కేవలం ఉపవాసాల నెల మాత్రమే కాకుండా, మనస్సును పరిశుభ్రం చేసుకునే ఆత్మపరిశీలన కాలమని అన్నారు. ఉపవాసం ద్వారా నియమం, సహనం, క్రమశిక్షణ పెంపొందుతాయని, పేదల పట్ల కరుణాభావం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. దానధర్మాలు, సహనశీలత, సోదరభావం వంటి విలువలు ఈ పవిత్ర మాసంలో మరింత ఆవిష్కృతమవుతాయని చెప్పారు. అల్లా కృపతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి బోధన్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బోధన్ ఎసిపి శ్రీనివాస్, సీఐలు వెంకటనారాయణ, విజయబాబు, కృష్ణ , ఎస్సై హబీబ్, మజీద్ కమిటీ సభ్యులు మహబూబ్ గుల్ షాని, సయ్యద్ జాకీర్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు. సీపీ హాజరుకావడం పట్ల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థుల “ప్రేమాక్షరి” మంచి ప్రయత్నం

- జర్నలిజం విద్యార్థుల పుస్తక రచన ప్రయత్నానికి ప్రశంస.
- సాహిత్యంపై విలువైన సూచనలు.
- రచనలను ప్రోత్సహిస్తున్న వర్సిటీకి అభినందనలు.
- ప్రముఖ సినీ పాటలు, కథా రచయిత సుద్దాల అశోక్ తేజ.





హైదరాబాద్ మార్చి 04,(జన సంఘర్షణ):

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం విద్యార్థులు ప్రేమపై తమ మనసులోని భావాలను, సృష్టిలోని ప్రేమను, బంధాల్లోని ప్రేమామృతాన్ని, ప్రకృతి పరవశాన్ని, ప్రేమ పర్యవసానాన్ని కవితాత్మకంగా తెలియజేస్తూ ప్రేమాక్షరి పేరుతో త్వరలో అద్భుత పుస్తకం ఆవిష్కరించబోతున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ సినీ పాటలు, కథా రచయిత సుద్దాల అశోక్ తేజను బుధవారం రోజు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ నేపథ్యంలో పుస్తకానికి బీజం పడిన కారణాలను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా రాసిన సాహితీ ప్రేమను ఆయనతో పంచుకున్నారు. విద్యార్థులు రాసిన కవితలను, సాహిత్యాన్ని పరిశీలించారు. విలువైన సూచనలను తెలియజేశారు. తొలిసారిగా రచనలను ప్రారంభించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. తొలి ప్రయత్నంలో అద్భుతంగా రాయడం సంతోషమని చెబుతూనే వారికి కొన్ని సూచనలను, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యాబోధనతో పాటు సాహితీ ప్రేమికులుగా విద్యార్థులను ప్రోత్సహించడం తెలుగు విశ్వవిద్యాలయం గొప్పదనమని పేర్కొన్నారు. తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావును, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావును, జర్నలిజం విభాగాధిపతి ఆచార్య బిహెచ్. పద్మప్రియలకు అభినందనలు తెలిపారు. 7వ తరగతి చదువుతున్న సమయంలో తాను రాసిన ఓ పాటను ఉపాధ్యాయులు గుర్తించి, ప్రోత్సహించడం వల్లే తాను నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా అవార్డు అందుకునే స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ పుస్తకానికి ముందు మాట రాసిస్తానని పేర్కొనడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. సుద్దాల అశోక్ తేజను కలిసిన వారిలో విశ్వవిద్యాలయం విద్యార్థులు, ప్రేమాక్షరి రూపకర్త, రచయితలు కొండూరి కోటిబాబు, అంజిబాబు నాగుల, ఎస్.దాసు, సిరిపురం సునేహా తదితరులు పాల్గొన్నారు.

# 25 వేల బోగస్ ఉద్యోగుల కుంభకోణం బయటపడింది

- ఫోరెన్సిక్ ఆడిట్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు...
- అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కేసులు నమోదు చేయాలని స్పష్టం

హైదరాబాద్ . మార్చ్ 4 . ( జన సంఘర్షణ )

రాష్ట్రంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులను ఉన్నట్లుగా చూపించి, నెలనెలా జీతాలు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.

**ఆధార్ లింకేజీతో బయటపడిన మోసం**

ప్రభుత్వం చేపట్టిన ఆధార్ లింకేజీ ప్రక్రియలో ఈ భారీ అక్రమం బయటపడింది. ఉద్యోగుల పేర్లతో జీతాలు డ్రా చేస్తున్నా, వాస్తవానికి ఆ వ్యక్తులు ఉద్యోగంలో లేరని గుర్తించారు. గత పదేళ్లుగా ఈ మోసం కొనసాగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కేసులు**



బోగస్ ఉద్యోగుల పేర్లతో జీతాలు పొందిన అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం స్పష్టంగా ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారిని ఏ మాత్రం వదిలిపెట్టబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశాలు**

ఈ మొత్తం వ్యవహారంపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ఆర్థిక శాఖకు ఆదేశించారు. అక్రమ చెల్లింపులు ఎలా జరిగాయి? ఎవరెవరు దీనిలో భాగస్వాములయ్యారు? ఎంత మేర నష్టం జరిగింది? అనే అంశాలను లోతుగా పరిశీలించనున్నారు.

**లోతైన విచారణకు సిద్ధం**

సీఎం రేవంత్ రెడ్డి ఈ ఘటనను అత్యంత కఠినంగా పరిగణించి, పూర్తి స్థాయి విచారణ జరిపి దోషులను చట్టపరంగా శిక్షించాలనే సంకల్పంతో ఉన్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపగా, ప్రజల్లో కూడా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఫోరెన్సిక్ ఆడిట్ అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

# దైవదర్శనానికి వెలుతూ అనంత లోకాలకు...





- ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుమంది దుర్మరణం
- పలమనేరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

పలమనేరు, మార్చి 04 ( జన సంఘర్షణ ) :

తిరుమల దైవదర్శనానికి బయలుదేరిన వారికి మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంత లోకాలకు చేరుకొన్న సంఘటన మండలంలో బుధవారం ఉదయం చోటుచేసుకొన్నది. పోలీసులు, రవాణా అధికారులు వెళ్ళడించిన వివరాలు ప్రకారం......కర్ణాటక రాష్ట్రం బెంగళూరు కె.ఆర్.పురం కు చెందిన మోహన్ దాస్ కుటుంబం బుధవారం ఉదయం తిరుమల బయలుదేరారు.

మార్గమద్యంలోని పలమనేరు సమీపంలోని బైపాస్ రోడ్డులో వై. ఎస్. ఆర్. జంక్షన్ వద్ద ముందువైపు వెలుతున్న లారీని మోహన్ దాస్ ప్రయానిస్తున్న కారు అతివేగంగా ఢీకొని సగం కారు లారీ క్రింది బాగానికి చేరుకొన్నది. ఈ ఘటనతో కారులోని మోహన్ దాస్(71), నాగరాజా రావు(61), కుసుమ(61), జయంతి(51), పూజ(33)లు అక్కడికక్కడే ప్రాణాలు వదిలేరు. మృతదేహాలను జె.సి.బి సహాయంతో పోలీసులు బయటికి తీశారు.

**స్పందించిన జిల్లా, స్థానిక అధికారులు**

జరిగిన ఘోర రోడ్డు ప్రమాధానికి జిల్లా రవాణా అధికారులు, స్థానిక అధికారి మధుసూదన్ లతో పాటు గంగవరం పలమనేరు సీఐలు రాంభూపాల్, మోహన్ రెడ్డి ల పోలీస్ బృందం హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ విషయం పై రవాణా అధికారి మధుసూదన్ మాట్లాడుతూ...కారులో సాంకేతిక లోపంతో పాటు డ్రైవర్ తప్పిధం ఉందని తెలుస్తుందన్నారు. కాగా జిల్లా రవాణా అధికారులు సంఘటన జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలన చేశారు.

# సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించండి

- పీడీఎస్‌యూప ప్రథమ జాతీయ మహాసభలో వక్తల పిలుపు

నంద్యాల మార్చి 04 ( జన సంఘర్షణ ) :

సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న అసమానతులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కవి, రచయిత, సామాజిక విశ్లేషకులు జీ.లక్ష్మీ నరసయ్య పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రథమ జాతీయ మహాసభలు మంగళవారం విజయవాడ నగరం లోని సింగ్ నగర్ లో ఉన్నటువంటి గుజ్జల సరళ దేవి ఫంక్షన్ హాల్ లో రెండు రోజులపాటు జరిగే మహాసభలు మొదటి రోజు మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ ఎం. రామకృష్ణ జెండాను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం మహాసభల షెడ్యూల్ లో భాగంగా జరిగిన విద్యా గోష్టి లో జి. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ సమాజంలోని మనుషులంతా దోపిడీ పీడన వివక్ష లేని సమ సమాజం ఏర్పాడాలని బాధ్యత తీసుకొని 50 ఏళ్లకు పైగా విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నరాణాఖ విద్యార్థి నాయకత్వానికి ముందుగా అభినందనలు తెలుపుతున్నాను. ఈరోజు సామ్రాజ్యవాద విష సంస్కృతి ఒకవైపు బ్రాహ్మణీయ హిందూత్వ సంస్కృతి మరొకవైపు విద్యార్థుల మెదళ్లను కలుషితం చేస్తుందని విద్యార్థులను సమాజం వైపు ఆలోచించలేని మరమనుషులుగా తయారు చేస్తుందని ఈ సమయంలో విద్యార్థులను సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి విజయవాడ నగరంలో జాతీయ మహాసభలు నిర్వహించడం అభినందనీయమైందని అన్నారు. విద్య ఒక సరుకుగా మారి విద్య వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ ను ప్రశ్నించే సంస్థలు లేకుండా పోయాయని అన్నారు. హిందుత్వ సంస్కృతి అనే పేరుతో విద్యార్థులు యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి ప్రశ్నించొద్దని ప్రజా సమస్యలపై మాట్లాడొద్దని ఒకవేళ వీటి గురించి మాట్లాడితే దేశద్రోహులుగా అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని మీరు పుట్టుకతో ఏ స్థితిని కలిగి ఉన్నారో దానిని అనుభవించాలే తప్ప మార్పును అభివృద్ధిని కోరుకోవద్దనే మనువాద సూత్రీకరణలు చేస్తున్నారని తెలిపారు. చట్టాలు ప్రభుత్వ విధానాలు సంపన్న వర్గాలను మరింత సంపన్నులుగా పేద వర్గాలను మరింత పేదవారుగా చేసే విధంగా రూపొందిస్తున్నారని ఇది దేశాన్ని తిరోగమనం వైపు నడిపించే విధానాలని అన్నారు. వర్ణాశ్రమ ధర్మం ప్రకారం ఏ హక్కులైతే ఉంటాయో వాటిని ప్రజలంతా పాటించాలని మెజారిటీ మతం పేరుతో ఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తున్నారని దీనికి వ్యతిరేకంగా విద్యార్థుల ప్రశ్నించాలని అన్నారు. ప్రపంచంలో ఈరోజు అమెరికా , ఇజ్రాయిల్ కలసి ఇరాన్ పై సంయుక్త గగనతల దాడులు చేసి ఇరాన్ దేశాధినేత ఖమేనీ నీ అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా హత్య చేయడం గురించి ప్రజాస్వామిక వాదులు మాట్లాడితే బంగ్లాదేశ్లో హిందువుల దాడి గురించి ఎందుకు మాట్లాడటం లేదని సంఘ పరివార్ శక్తులు ప్రశ్నిస్తున్నాయని ఎక్కడ అన్యాయం జరిగినా మాట్లాడేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని అన్నారు. రమణయ్య హిందూ సంస్కృతి అంటే కేవలం విద్వేషం, విధ్వంసం మాత్రమేనని అన్నారు. ఈ నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను దేవుడే సృష్టించాడని మార్చడానికి మనం ఎవరమని చెబుతున్నారని బెనారస్ హిందూ యూనివర్సిటీలో చేతబడి కర్మకాండల, జ్యోతిష్యం వంటి కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులను ఏ రకమైన అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని ప్రశ్నించారు. ఇలాంటి వ్యవస్థకు వ్యతిరేకంగా విప్లవ విద్యార్థులు పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.



అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం పేరుతో 2020 పేరుతో జాతీయ ఉద్యమ కాలం నుండి ఏర్పడ్డ ఆకాంక్షలకు అనుగుణంగా తీసుకువచ్చిన సెక్యులర్ సోషలిస్ట్ వంటి పదాలను చేర్చకుండా సామాజిక న్యాయం సమాజంలో ఎలా సాధ్యమవుతుందని జాతీయోద్యమంలో పాల్గొనని బిజెపి ఆర్ఎస్ఎస్ శక్తులు అనేక ఆచార వ్యవహారాలు భాషా సంస్కృతులు ఆహారపు అలవాట్లు ఉన్న భారతదేశ ప్రజలపై హిందూ మత ఆధిపత్యాన్ని కోరుకుంటున్నారని ఇది భారత రాజ్యాంగ మూల సూత్రాలకు వ్యతిరేకమైనదని అందుకే భారత రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని అన్నారు. విద్య ద్వారా మాత్రమే సమాజాన్ని మార్చే అవకాశం ఏర్పడుతుందని అందుకని అనగారిన వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యాసంస్థల్లోకి రానీయకుండా రోహిత్ వేముల వంటి విద్యార్థులను కులం పేరుతో మానసికంగా క్షోభ కు గురిచేసి ఆత్మహత్య చేసుకునే విధంగా వేధించారని నేడు జోహార్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఆంధ్ర యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ వంటి ప్రధానమైన యూనివర్సిటీలో విద్యార్థుల మధ్య విభేదాలను సృష్టించి యుజిసి తీసుకొచ్చిన సమానత్వ మార్గదర్శకాలను కూడా వ్యతిరేకించేది బిజెపి ఆర్ఎస్ఎస్ వంటి సంఘ పరివార శక్తులేనని అన్నారు.

ఇంకా ఈ మహాసభలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు పి. టాన్య మహాసభల ప్రారంభ ఉపన్యాసం చేయగా , సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు అశోక్ గాయల్, పరిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ కోశాధికారి ఎల్ .భాను సందేశం ఇచ్చారు, అదేవిధంగా జాతి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఇ .విజయ్ కన్నా, యు. గనిరాజు, మొగిలి వెంకటరెడ్డి, ఎస్ కిరణ్ కుమార్, ఎస్ఎండి రఫీ లు ప్రసంగించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ,మహారాష్ట్ర రాష్ట్రాల నుండి విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాడి రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం గంధమనేని జయశంకర్ నాయుడు

మార్చి 04 ( జన సంఘర్షణ ) :




పాడి రైతుల అభివృద్ధి లక్ష్యం అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు మండల పశు వైద్య కేంద్రంలో గడ్డి కత్తిరించే యంత్రాల పంపిణీ కార్యక్రమం మండల పశు వైద్య అధికారి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పాడి రైతులకు యంత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాడి రైతుల అభివృద్ధి చెందాలని ఆలోచనతో గడ్డి కత్తిరించే యంత్రాలను 50 శాతం సబ్సిడీ ద్వారా అందిస్తోందని అన్నారు. ఈ యంత్రాలు 40,500/- రూపాయలు అయితే పాడి రైతులకు 20250/- రూపాయలకు అందిస్తోందని తెలిపారు. పాడి రైతులను అభివృద్ధి కాక వారు ఆర్థికంగా ఎదగాలని వారికి అన్ని రకాల బ్యాంకుల్లో రుణ సాకారం కూడా అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో జీడి నెల్లూరు నియోజకవర్గం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ సహకారంతో అభివృద్ధి చెందుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, మండల పశువైద్యాధికారిని శ్రీవిద్య, సింగల్ విండో చైర్మన్ నిరంజన్ రెడ్డి, బూత్ కన్వీనర్ చిరంజీవి, నాయకులు నోమేష్ రెడ్డి, లోకేష్ ,దశరథన్, మధు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీర్థంలో బాల్యవివాహాల మీద అవగాహన

బైరెడ్డిపల్లి మార్చి 04 ( జన సంఘర్షణ ) :



బైరెడ్డిపల్లి మండలం లోని తీర్థం గ్రామంలో బుధవారం వైద్యాధికారి పద్మావతి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్.ఈ.ఓ. కాంతమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సు లో పెళ్లి ల్లు చేసినయెడల కలిగే నష్టాలు గురించి వివరించడం జరిగింది. అలాగే వేసవికాలం లో బయటకు వెళ్ళేటప్పుడు కాళ్ళకు చెప్పులు, తలపై టోపీ పెట్టుకొని వెళ్లాలని, నీళ్ళు ఎక్కువుగా తాగాలని, వ్యవసాయం పనులు ఉదయం చేసుకోవాలని ఎండలో ఎక్కువగా ఉండకూడదని చెప్పడం జరిగింది. అలాగే ఈ వేశవికాలంలో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి అని , వంట చేసేటప్పుడు నూనె, ఉప్పు, చక్కర తగ్గించి నయెడల బిపి, షుగర్, ల వంటి వ్యాదులు రాకుండా ఉంటాయి అని వివరించడం జరిగింది. ఈకార్యక్రమంలో వి ఓ సంఘం లీడర్ ఆదిలక్ష్మి, ఆషా శాంతమ్మ, సంగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశిక్షణ సంస్థ డైట్ లో విచారణ చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్

కార్వేటినగరం మార్చి 04 ( జన సంఘర్షణ ) :



కార్వేటి నగరంలో ఉన్న జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ లో డిసెంబర్ నెల 22వ తేదీన సపోజ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఛాత్రోపాధ్యాయులు ఎవరు క్రిస్టియన్ విద్యార్థి లేకపోవడంతో కళాశాలలో పనిచేస్తున్న సూపర్నెంట్ కృపావతి చిత్తూరు నుంచి పాస్టర్లు తీసుకొచ్చి డైట్ లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతో, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారులు స్పందించి త్రిషభ్య కమిటీ విచారణ చేపట్టారు. సూపర్డెంట్ కు మేము జారీ చేశారు. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, ఏడి వెంకటేశ్వరరావు దీనిపై విచారణ నిర్వహించారు. వారి దగ్గర నివేదికను తీసుకొని ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని డీఈవో తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చిన తర్వాత చర్యలు ఉంటుందన్నారు.

# విద్యార్థులకు పరీక్షా సామాగ్రి వితరణ

వరదయ్య పాలెం మార్చి 04 ( జన సంఘర్షణ ) :



పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం గోవర్ధన్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 37 మంది విద్యార్థిని విద్యార్థులకు బుధవారం బిఈపిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షా సామాగ్రిని అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా హాజరై విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పడంతో పాటు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న బీఈపిసి ఫౌండర్ రియాజ్ ను అభినందించారు. అనంతరం బిఈపిసి ఫౌండర్ రియాజ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకారం అందించిన మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొహిద్దిన్, ఉపాధ్యాయులు ముద్దు కృష్ణ, కానిస్టేబుల్ శివప్రసాద్, బీఈపిసి సభ్యులు ఉమర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ.. కొత్త వెలుగులు నింపాలి..

**కోరుట్ల ఐఎంఏ హాల్ లో హోలీ సంబరాలు..**



**కోరుట్ల:**
హోలీ వేడుకలు అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఐఎంఏ స్టేట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అనూప్ రావ్ ఆకాంక్షించారు. మంగళవారం హోలీ పండుగను పురస్కరించుకొని కోరుట్ల ఐఎంఏ వైద్యులు వారి కుటుంబ సభ్యులతో కోరుట్లలోని ఐఎంఏ హాల్లో ఘనంగా హోలీ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఐఎంఏ ప్రెసిడెంట్ డా.రేగొండ రాజేష్, ఐఎంఏ సెక్రటరీ డా. కే.జగదీశ్వర్, ట్రెజరర్ డా.అన్వేష్, డా.రవి కిరణ్, డా.మనోజ్ కుమార్, డా.ఇంద్రనీల్, డా.రమేష్, డా.నరేష్, డా.రాజేందర్, డా.రాజేష్, డా.లక్ష్మీపతి, డా.సంతోష్, డా.రఘుపతి, మహిళా వైద్యులు డా స్వీతీ అనుప్, డా.అనురాధ జగదీశ్వర్, డా.జ్యోత్స్న, డా.ప్రియాంక, డా.గీత ఇంద్రనీల్, డా.శృతి మిగతా వైద్యులు పాల్గొన్నారు..

# నేషనల్ సైనిక్ స్కూల్ కు ఎంపికైన లిటిల్ జీనియస్ విద్యార్థి




**కోరుట్ల :**
కోరుట్ల లిటిల్ జీనియస్ హైస్కూల్ లో 8వ తరగతి చదువుతున్న రాచర్ల హృషీకేష్ నేషనల్ సైనిక్ స్కూల్ నిర్వహించిన పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి నేషనల్ సైనిక్ స్కూల్ కు ఎంపికయ్యాడు. ఏలాంటి ముందస్తు శిక్షణ లేకుండానే కేవలం తరగతిలో నేర్చుకున్న విషయ పరిజ్ఞానంతోనే పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించి 136 మార్కులతో ఎంపిక కాబడ్డాడు. ఈ సందర్భంగా బుధవారం రోజున పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. అభినందన కార్యక్రమంలో హృషీకేష్ ను వారి తలిదండ్రులను స్కూల్ యజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి మహాదేవ్ మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని హృషీకేష్ సద్వినియోగం చేసుకున్నాడు కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని విద్యార్థులందరు హృషీకేష్ ను చూసి నేర్చుకోవాలని ఆ విధంగానే శ్రమచేసి మంచి స్థానాన్ని పొందాలి మరియు హృషీకేష్ సైనిక్ స్కూల్ లో కూడా మంచి ప్రగతి సాధించాలని మా పాఠశాల కు కీర్తి తేవాలని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులైన రాచర్ల విజయ్ శ్రావణి దంపతులను మరియు హృషీకేష్ ను కూడా శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హైస్కూల్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ప్రైమరీ ప్రిన్సిపాల్ వినోద, ప్రీ ప్రైమరీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి , పాఠశాల డైరెక్టర్ రాజు, అడ్వైజర్ శంకర్, ఉపాధ్యాయులు ఆమెరా మేడమ్, శశికళ, సుధాకర్, ప్రమీల, జీవిత, మహేష్, తదితరులు పాల్గొన్నారు..

# లలితా దేవి దశదిన కర్మకు హాజరై నివాళు లర్పించిన మాజీ ఎంపీపీ సున్నం లలిత



**అన్నపురెడ్డిపల్లి**
అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డి పల్లి గ్రామంలో క్రీస్తు శేషులు కాళ్లూరి వెంకట సీతారామ రుక్మధరావు దొరగారి ధర్మపత్ని క్రీస్తు శేషులు కాళ్లూరి లలితా దేవి, అమ్మ దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజే సిన బి.ఆర్. ఎస్ పార్టీ అశ్వరావుపేట నియోజకవర్గం నాయకురాలు అన్నపురెడ్డిపల్లి మాజీ ఎంపీపీ సున్నం లలిత, అలాగే శ్రీహరి హర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగానే శ్రీనివాసరావు, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి చైర్మన్ మల్లెల నరసింహారావు, వైస్ సర్పంచ్ మారగాని అశోక్, జంగాల శ్రీనివాసరావు, వార్డు మెంబర్స్ సత్యనారాయణ, చల్లా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా హోలీ వేడుకలు

**పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో బుధవారం ఘనంగా హోలీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా పోలీస్ అధికారులంతా కలిసి ఎస్పీ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి హోలీ వేడుకలకు ఎస్పీ రోహిత్ రాజును ఆహ్వానించారు. అక్కడ అధికారులు, సిబ్బంది రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. అనంతరం ఎస్పీతో కలిసి అధికారులంతా హేమచంద్రాపురం నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ నకు చేరుకొని పోలీస్ బ్యాండ్ చప్పుళ్లకు నృత్యాలు చేశారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్ నందు ఆనందోత్సవాల మధ్య కేరింతలతో హోలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వరూప్ నగర్ లో రూ.1.82 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం

**-మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి**

**ఉప్పల్**
ఉప్పల్ డివిజన్ లోని స్వరూప్ నగర్ లో రూ. 1.82 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లుగా మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటికే రూ. 69 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లుగా చెప్పారు. రజితాపరమేశ్వర్ రెడ్డి బుధవారం స్వరూప్ నగర్ లో కాలనీ వాసులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తోందని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్టుగా చెప్పారు.




ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్టుగా తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వరూప్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వెంకటేశ్వర్ రెడ్డి, సిద్దేశ్వర్, పూజారి హనుమంతు సల్ల ప్రభాకర్ రెడ్డి, అమరేంద్రరావు, శ్రీనివాసరెడ్డి, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, ఆనంద్ ప్రభు, కుమార్, పిసటి అంజిరెడ్డి,



వెంకటేష్,రాకేష్ నాయక్,సురేష్,పవన్, శ్రీనివాస్,

# రోడ్డు ప్రమాద బాదితులను కాపాడితే “రహ వీర్ పథకం” ద్వారా రూ.25 వేల పారితోషికం.

**జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్**

**జగిత్యాల :**
రోడ్డు ప్రమాదాల సమయంలో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి వారి ప్రాణాలను కాపాడే బాధ్యతగల పౌరులను (గుడ్ సమారిటన్స్) ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “రహ వీర్ పథకం” ద్వారా రూ. 25,000/- నగదు పారితోషికం మరియు ప్రశంసా పత్రం అందజేయబడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుం టున్నాయని, ప్రమాదం జరిగిన తొలి గంటను “గోల్డెన్ అవర్” గా పరిగణిస్తారని ఈ సమయంలో బాధితులకు సమయానికి వైద్య సహాయం అందితే అనేక ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కానీ కొంతమంది పౌరులు పోలీస్



కేసులు ఉండొచ్చనే భయంతో గాయపడిన వారికి సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని ఈ భయాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం “రహ వీర్ పథకం”ను అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలను కాపాడిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల నగదు ప్రోత్సాహంతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తుంది. సహాయం చేసిన వ్యక్తిపై ఎలాంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు సమాచారం ఇవ్వాలని, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆసుపత్రికి గాయపడిన వారిని తరలించాలని సూచించారు. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి ప్రాణాలను కాపాడే కార్యంలో భాగస్వామి కావాలని కోరారు..

# విద్యార్థులు మెరుగైన ఫలితాలకు జయీభవ విజయీభవ 2.0 ను అనుసరించండి.

**జయీభవ విజయీభవ 2.0 పోస్టర్ ఆవిష్కరణ**

**ఎంఈఓ గంగుల నరేశం**

**కోరుట్ల :**
పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ రూపొందించిన జయీభవ విజయీభవ 2.0 పంచ సోపానాలు కరపత్రాన్ని బుధవారం కోరుట్లలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగుల నరేశం మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షల సమయంలో ప్రణాళిక బద్ధంగా చదవాలని శారీరక ఆరోగ్యం కలిగి ఉండడానికి పోషక విలువ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని జంక్ ఫుడ్డుకు దూరంగా ఉండాలని ఒత్తిడిని జయించడానికి ప్రతినిత్యం వేకువజామున నిద్రలేచి యోగ చేయాలని సూచించారు. పూర్వ ప్రశ్న పత్రాల సాధన ఒత్తిడికి దూరంగా ఉండాలని రాత నైపుణ్యం గురించి ప్రశ్న పత్రాన్ని బాగా చదివి అర్థం చేసుకొని ప్రశ్నలకు అనుగుణంగా సమాధానాలు చక్కటి రాతతో విరామ చిహ్నాలు పాటిస్తూ దోషాలు లేకుండా సైడ్ హెడ్డింగ్స్ తో పాయింట్లు వారిగా స్పష్టంగా రాయాలని తెలిపారు. వినయ విధేయతలు కలిగిన తల్లిదండ్రులు గురువులు చెప్పిన మంచి మాటలు విని ఆచరించాలని ఉత్తమ పౌరులుగా ఎదగడానికి తల్లిదండ్రులను గురువులను పెద్దలను గౌరవించి కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండాలని చదవడం అనేది ఒక అలవాటుగా మార్చుకొని కష్టపడే తత్వాన్ని మంచితనానికి సమాజం పట్ల బాధ్యతను పెంచుకోవాలని కోరిక నమ్మకం పట్టుదల శ్రమ అని ఆయుధాలతో పదవ తరగతిలో అత్యున్నత ప్రమాణాలతో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తల్లిదండ్రుల యొక్క ఆశయాలను నెరవేర్చుకుని బాధ్యత గల పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.గంగాధర్, సిహెచ్ కృష్ణ



మోహన్ రావు, ఎండి అబ్దుల్ రవూఫ్, కే.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సి.ఆర్.పి గంగాధర్, జ్యోతి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

# డిజిటల్ విద్యాబోధనతో విద్యార్థులకు ఎంతో మేలు

**-అడిషనల్ కలెక్టర్ బిఎస్.లత**

**జగిత్యాల :**
చెవులతో వింటూ కళ్లతో చూసి నేర్చుకోనే విద్య ఎంతో మేలు చేస్తుందని అందుకే డిజిటల్ విద్యతో విద్యార్థులు పాఠాలు బాగా నేర్చుకుంటారని అందువలన డిజిటల్ విద్య ఎంతో మేలు చేస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత అన్నారు. బుధవారం స్థానిక ఓల్డ్ హై స్కూల్ జగిత్యాల్ లో రోటరీ క్లబ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించినటువంటి రీయూసేబుల్, వాసిబుల్ క్లాత్ సానిటరీ ప్యాడ్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ విద్యకు అసౌకర్యం కలగకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వారన్నారు. జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కొరకు కృషి చేస్తున్న రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం అన్నారు.




అనంతరం ఆరు లక్షల విలువచేసే సానిటరీ ప్యాడ్స్ జగిత్యాల అర్బన్ మండల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఎనిమిది వందల మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం ముందస్తు మహిళా దినోత్సవం జరిపి కేక్ కట్ చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ మరియు కౌన్సిలర్లను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ అరవ లక్ష్మి, మండల విద్యాధికారి చంద్రకళ, రోటరీ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏవీఎల్ ఎన్ చారి, రాజు, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, టీవీ సూర్యం, బొడ్ల జగదీష్, పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, ప్రముఖ వైద్యులు స్వరూప తదితరులు పాల్గొన్నారు...

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
గురువారం
05 మార్చి 2026

## రోడ్డు వెడల్పు కొలతలు తారుమారు గ్రామస్తులు




**అన్నపురెడ్డిపల్లి**

అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న డబుల్ రోడ్ నిర్మాణ పనుల్లో కొలతలను తారుమారు చేసి పనులు చేపట్టడం పట్ల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడం వల్ల పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామ ప్రజల వివరాల ప్రకారం,రహదారి వెడల్పు మరియు పొడవు విషయంలో అధికారిక అంచనాలు ఒకలా ఉండగా,ప్రస్తుత నిర్మాణంలో కొలతలు తగ్గించి పనులు కొనసాగిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.గ్రామంలో కొంత ప్రాంతంలో రోడ్డు వెడల్పు తగ్గించడం గ్రామ శివారులో రోడ్డు కొలతలు మరో విధంగా ఉండటం విచిత్రంగా వుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై సంబంధిత అధికారులను పలుమార్లు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.రోడ్డు నిర్మాణంలో వెడల్పు తగ్గిస్తే రానున్న రోజుల్లో రద్దీ పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని గ్రామ ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తే కొందరు కాంట్రాక్టర్లు వారికి ఇష్టం వచ్చిన కొలతలతో రోడ్డు పనులు చేయడం దురదృష్టకరం అని అన్నారు.తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను సాంకేతిక నిపుణులతో పరిశీలించి సరైన కొలతలతో పునర్నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోనీ రోడ్డు అంత ఒకే విధమైన కొలతలు ఉండే విధంగా నిర్మాణాలు చేసే విధంగా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## యూరియా కోసం రైతుల ఆందోళన

**-జాతీయ రహదారిపై ధర్నా**

**- యాప్ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు**



**కల్వకుర్తి :**

రేవంత్ పాలనలో యూరియా కొరత తీవ్రంగా ఉందని ఆరోపిస్తూ కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.యాసంగి సీజన్‌లో పంటలకు అత్యవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీలో 700 బస్తాల యూరియా వచ్చినప్పటికీ కేవలం రెండు మూడు నిమిషాల్లోనే నిల్వలు పూర్తయ్యాయని, వెంటనే నిల్వలు శూన్యం అని చూపిస్తోందని రైతులు మండిపడ్డారు.యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమలో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేవని, యాప్ వినియోగం తెలియదని, దీంతో ఎరువు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూరియాను పాత పద్ధతిలోనే పత్తాదారు పాస్ పుస్తకం ఆధారంగా అందజేయాలని రైతులు డిమాండ్ చేశారు.ధర్నా కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు వాహన రాకపోకలు అంతరాయం కలిగాయి. అనంతరం అధికారులు చేరుకుని రైతులతో చర్చలు జరిపినట్లు సమాచారం. సమస్యను వెంటనే పరిష్కరించాలని రైతులు హెచ్చరించారు.

## వైభవంగా శ్రీరామసహిత సత్యనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**-కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న తవిడబోయిన గిరిబాబు**

**-ఉప్పల్ ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్ష**






**ప్రజావారధి :**

ఇందిరానగర్, రామంతాపూర్‌లోని శ్రీ రామసహిత సత్యనారాయణ స్వామి దేవసానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవం వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా జరిగింది. పుష్పాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.ఈ వేడుకలకు రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ తవిడబోయిన గిరిబాబు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ నరసింహా రెడ్డి, కమిటీ సభ్యులు భాస్కర్ గంగపుత్ర, బుల్లెట్ అశోక్, ముత్యాల విజయ్, నర్ల అశోక్, జేసీబీ రాజు, ముత్యాల బాబురావు, సర్వి సంతోష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ శ్రీ రామసహిత సత్యనారాయణ స్వామివారి కృపాకటాక్షాలు అందరి మీద ఉండాలని ప్రార్థించారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆలయ ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని, సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

# రెండు పేర్లతో ఇంటర్ బోర్డ్ ను మోసం చేస్తున్న అర్బేన్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**ఇంటర్ బోర్డ్ పీఆర్ఓకు ఫిర్యాదు చేసిన ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్**






**ఉప్పల్ :**

రెండు పేర్లతో ఇంటర్ బోర్డ్ ను మోసం చేస్తున్న అర్బేన్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ నాంపల్లి లోని ఇంటర్ బోర్డ్ విద్యామండలి పీఆర్ఓ శ్రీనివాస్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ ఇటీవల ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు నాచారం లోని అర్బేన్ కళాశాల పరీక్ష సెంటర్కు వేదిక అయిందని, కానీ సదరు కళాశాల రెండు పేర్లతో నడుపుతూ విద్యార్థులను వారి తల్లితండ్రులను, ఇంటర్ బోర్డ్ ను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవంగా అర్బేన్ జూనియర్ కళాశాలకు అనుమతులు ఉంటే, నానో కళాశాల పేరుతో అసోసియేట్ అయినట్టు నడిపిస్తూ మోసం చేస్తున్నారన్నారు. ఈ నిర్లక్ష్యపు విధానాలతో అర్బేన్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని నిబంధనలు విరుద్ధంగా నడుపుతున్నారని వారు ధ్వజమెత్తారు.అందుకే ఇంటర్ బోర్డ్ సదరు కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అదేవిధంగా 2026 విద్య సంవత్సరానికి ముందే ఇంటర్ అడ్మిషన్లు చేపడుతున్నారని వీటిని కట్టడి చేసి అర్బేన్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 12-17 వరకు క్రికెట్ టోర్నమెంట్

**క్రికెట్ పోస్టర్ ను విడుదల చేసిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి**




**ఉప్పల్ :**

షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మార్చ్ 12-17 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీ క్రికెట్ గ్రౌండ్లో క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు, ఈ టోర్నమెంట్ కు సంబంధించిన గోడ పత్రికను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తో విడుదల చేయించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ,నెర్లకంటి శ్రీకాంత్ లు సంయుక్తంగా మాట్లాడుతూ భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యలో కీలక భూమిక పోషించారని, అటువంటి మహనీయుడిని స్మరిస్తూ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని వారు అన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ ను రాష్ట్ర పరిధిలోని యువజన, క్రీడల శాఖ మాత్యులు వాకిటి శ్రీహరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు,సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ. నర్సింహా,ఏమినెంట్ క్రీడాకారులు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభించనున్నారని, అదే విధంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని వారు ప్రకటించారు. ఈ టోర్నమెంట్ లో పాల్గొనాలనే యువత ఈ క్రింది నంబర్లను సంప్రదించాలని కో ఆర్డినేటర్ శ్రీకాంత్ 7386690103, ఆర్గనైజర్స్ బాలకృష్ణ 8885173361, మహమూద్ 8121347855 అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్,కార్యవర్గ సభ్యులు కళ్యాణ్,జోసెఫ్ భాను, అనీల్ కుమార్ పాల్గొన్నారు.

విలేకరులు కావలేను



తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థాయి రిపోర్టర్లుగా పనిచేయుటకు ఆసక్తి, ఉత్సహం కలిగిన యువతి, యువకులు కావలేను. సీనియర్‌లకు ప్రాధాన్యత ఇవ్వబడును

వివరాలకు సంప్రదించండి 63050 26524

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co